క్లుప్తంగా

ఓటు మన బాధ్యత

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ తదితరులు

తుర్కయంజాల్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్ సూచించారు. శనివారం ఇంజాపూర్‌లోని తుల్జా భవానీ కాలనీలో ఓటు అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది బాల్‌రాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



అతిథులను సత్కరిస్తున్న శ్రీనివాస్‌రావు

అబ్దుల్లాపూర్‌మెట్: అవంతి ఇంజినీరింగ్ విద్యాసంస్థల ఆవరణలో శనివారం విద్యాసంస్థల చైర్మన్, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెఎన్‌టీయూహెచ్ సీఎస్ఈ రెక్టార్ డాక్టర్ గోవర్ధన్, రాష్ట్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగేశ్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, వైస్ ప్రెసిడెంట్ నందీశ్, ఎండీ శ్రావణ్‌కుమార్, డైరెక్టర్ జయప్రద పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



ట్రోఫీతో విద్యార్థులు

బడంగ్‌పేట్: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ శ్రీవంశీధర్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 3 బంగారు, 2 రజిత, 18 కాంస్య పతకాలు సాధించడంతో పాటు చాంపియన్‌షిప్ కప్‌ను సైతం కైవసం చేసుకున్నారు. కాంటినెంటల్‌సాత్‌ఖాన్ కరాటేడో ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు, 50 పాఠశాలల నుంచి తలపడ్డాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె.కృష్ణారెడ్డి విద్యార్థులను శనివారం అభినందించారు. కార్యక్రమంలో డీన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాగ్యశ్రీకి బంగారు పతకం



పతకాలతో మౌంట్ కార్మెల్ స్కూల్ విద్యార్థులు

బడంగ్‌పేట్: రంగారెడ్డి జిల్లా 67వ ఎస్‌జీఎఫ్ పోటీల్లో బడంగ్‌పేటలోని మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. చదరంగంలో భాగ్యశ్రీ బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయింది. స్కేటింగ్ విభాగంలో పి.వర్షిత ఐదు వందలు, వేయి మీటర్ల విభాగంలో కాంస్యం సాధించింది. పి.వరుణ్ స్కేటింగ్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుప్రభ హనీ, శిక్షకులు నోమన్‌అలీ, హఫీస్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశభక్తి అలవర్చుకోవాలి

మొయినాబాద్: ప్రతిఒక్కరూ దేశ భక్తి అలవర్చుకోవాలని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు పేర్కొన్నారు. మొయినాబాద్ సిద్ధార్థ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఎందరో మహనీయులు జీవితాలను త్యాగం చేసి స్వాతంత్ర్య పోరాటంలో అమరులయ్యారని గుర్తు చేశారు. ఝాన్సీ లక్ష్మీబాయి చేసిన పోరాటం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ కళాశాల అధ్యక్షుడు కావలి శ్రీకాంత్, అంజయ్, సాయి, వంశీ, వికాస్, మహేశ్ పాల్గొన్నారు.

పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ప్రచారంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న కృపేష్, ప్రతాప్‌రెడ్డి

- మరోసారి సేవచేసే అవకాశమివ్వండి
- మరింత అభివృద్ధి చేస్తాం
- 30 ఏళ్లుగా ప్రజలతోనే ఉన్నా..
- వారి కష్టసుఖాలు తెలుసు
- బీఆర్ఎస్ అభ్యర్థి కిషన్‌రెడ్డి

మంచాల: పనిచేసే ప్రభుత్వాన్ని మరోసారి దీవించి ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోరారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం మంచాల మండలంలోని ఆగాపల్లి, కాగజ్ ఘట్, జాపాల, ఆస్మత్‌పూర్, పటేల్ చెరువుతండాలో కిషన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలను అమలు చేసి ఆర్థికాభివృద్ధికి తోడ్పడిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. 30 ఏళ్లుగా ప్రజలతో ఉన్నానని, వారి కష్టసుఖాలు తనకు తెలుసని పేర్కొన్నారు. నియోజకవర్గంలో గిరిజన తండాలు, మారుమూల గ్రామాలకు సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి.. వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్యాసంస్థలు, పరిశ్రమలు తెచ్చామని తెలిపారు. ఆసర పథకం ద్వారా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కల్యాణలక్ష్మి, షాదిముభారక్, దళిత, బీసీ, రైతుబంధు, రైతుబీమాతో ఆదుకున్నామని గుర్తుచేశారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సికింధర్‌రెడ్డి పాల్గొన్నారు.



రోడ్ షోకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

మామ కోసం కోడలు ప్రచారం

మంచాల: మంచాల మండలంలోని తాళ్లపల్లిగూడలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సతీమణి మౌనిక ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సంక్షేమ సారథిని గెలిపించండి

ఇబ్రహీంపట్నం రూరల్: సంక్షేమ సారథి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఎంపీపీ కృపేష్ కోరారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు గ్రామంలో వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మెటిల్లా, ఎల్మినేడులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృపేష్ మాట్లాడుతూ కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. .

'గ్యారంటీ'లను నమ్మొద్దు

యాచారం: కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను నమ్మి మోసపోవద్దని, బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం గునుగల్, గడ్డమల్లయ్యగూడలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ అధికార దాహంతో అమలుకు సాధ్యం కాని వాగ్దానాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. తాను చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా మారిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ కొనియాడారు. ప్రతిపక్ష పార్టీల మోసపూరిత మాటలు నమ్మొద్దని సూచించారు.

ఇంటింటి ప్రచారం

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డిని గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతూ ఆ పార్టీ శ్రేణులు చేశారు. శనివారం రాత్రి కూడా ప్రచారాన్ని ఆపలేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిరణప్ప ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను గడప గడపకూ వెళ్లి వివరించారు.

అధికారం బీఆర్ఎస్‌దే

- హ్యాట్రిక్ సాధించబోతున్నాం
- మంత్రి సబితారెడ్డి
- జోరుగా ఎన్నికల ప్రచారం

మహేశ్వరం: సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించబోతున్నానని విద్యాశాఖ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సబితారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి, రామచంద్రగూడ, పెండ్యాల, కల్వకోల్, దుబ్బచర్ల, సుభాన్‌పూర్, అయ్యావారిపల్లి, దిలావార్‌గూడ, కోళ్లపడకల్, పోరండ్ల గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసిన అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపైన గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే భారీ మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు డబ్బుల సంచులు నెత్తినపెట్టుకొని ప్రజలను కొనేందుకు యత్నిస్తున్నారన్నారు. కేంద్రలో బీజేపీ ప్రభుత్వం ఢిల్లీలో రైతుల ఉసురు పోసుకున్నారని, కాంగ్రెస్ పక్క రాష్ట్రంలో 3 గంటల విద్యుత్ ఇస్తుందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్, డైట్, జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ అదనపు గదుల నిర్మాణం చేశామన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు సబితమ్మకు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ, నాయకులు చంద్రయ్య, మల్లేష్ యాదవ్, అంజయ్యయాదవ్, రాజునాయక్, రాఘవేందర్‌రెడ్డి, పాండుయాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి సర్పంచులు యాదయ్య, అనితారెడ్డి, శివనాయక్, సంధ్య, థామస్‌రెడ్డి, స్లీవారెడ్డి, పద్మపాండు, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శకుంతల ఎంపీటీసీ సభ్యులు స్వప్న, సువర్ణరెడ్డి, చంద్రయ్య పలువురు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

హుడాకాంప్లెక్స్: హైదరాబాద్‌లో దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు సంతోషంగా ఉన్నారని బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం అభ్యర్థి సబితారెడ్డి అన్నారు. శనివారం సరూర్‌నగర్ డివిజన్‌లోని డాక్టర్స్‌కాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శాంతిభద్రతలతో పాటు అన్ని రంగాల్లో హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చటానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. నేడు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరానికి వస్తున్నాయన్నారు. గతంలో ఎల్‌బీనగర్ ప్రాంతం ఎట్లుండెనో.. నేడు ఫ్లైఓవర్‌లు, అండర్‌పాస్‌ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌యాదవ్, అంకిరెడ్డి, బాలకిషన్, కొండల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

తుక్కుగూడ: సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని ఆ పార్టీ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం రావిర్యాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మరోసారి మంత్రి సబితారెడ్డి గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, ప్రభాకర్, విష్ణువర్ధన్ రెడ్డి, నాగేశ్వర్, అశోక్, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



దుబ్బచర్లలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

కేఎల్లార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

దిల్‌సుఖ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అభ్యర్థించారు. రామకృష్ణపురం డివిజన్‌లో కేఎల్లార్‌కు మద్దతుగా వాసవికాలనీలో శనివారం నిర్వహించారు. అనంతరం బూత్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టో అన్ని వర్గాలకు ఉపయోగపడుతుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు. రోజు రోజుకు పార్టీకి ఆదరణ పెరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గణేష్ నేత, నాయకులు ఉపేందర్‌రెడ్డి, మహేందర్, శ్రీశైలం, కల్యాణ్‌యాదవ్, శేఖర్ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, మణికంఠ, శ్రవణ్, శ్రీధర్, కృష్ణ, ఇస్మాయిల్, ఇమ్రాన్, రాజునాయక్, ప్రేమ్‌నాయక్, భాస్కర్‌నాయక్, ఇస్మాయిల్, సలీం, జావేద్, రేణుక, శైలజ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి

బీఆర్ఎస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా మహ్మద్ దావూద్

కందుకూరు: బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా మండలంలోని దావూద్‌గూడకు చెందిన మహ్మద్ దావూద్ నియమితులైయ్యారు. ఈ మేరకు శనివారం మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

ఆర్థిక సాయం

కడ్తాల్: ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన పార్వతమ్మ, బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ మృతుల కుటుంబసభ్యులను శనివారం పరామర్శించి... ఇరు కుటుంబాలకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

గ్రామీణుల జీవన విధానంపై అవగాహన అవసరం

హస్తినాపురం: నేటితరం విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానం, వారి నేపథ్యం గురించి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని అక్షర స్కూల్ చైర్మన్ అర్వనపల్లి జగన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన విధానం, వారి నేపథ్యాన్ని నేటి తరానికి అర్థమయ్యేలా చెప్పడం కోసం అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ ఎల్‌బీనగర్ బ్రాంచ్ శనివారం అక్షర గ్రామోత్సవ్ పేరుతో ఒక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ, తమ పాఠశాలలో అంతర్జాతీయ పద్ధతిలో బోధన చేస్తూనే నేటి గ్రామీణ చరిత్రను ప్రజల ఇతివృత్తాన్ని విద్యార్థులకు బోధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమణి వారణాసి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గ్రామీణ ప్రాంత ప్రజల వేషధారణలో చిన్నారులు

కేసీఆర్ ప్రభుత్వం విఫలం



మీర్‌పేట: ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్

మీర్‌పేట: హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేసీఆర్ పెద్ద మోసకారి అని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో కలిసి మీర్‌పేట, జిల్లెలగూడ పరిధిలోని కాలనీలలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మేయర్ పారిజాతరెడ్డి, నాయకులు శ్రీశైలం, భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ: మహేశ్వరంలో కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్ గెలుపు ఖాయమని డీసీసీ కార్యదర్శి బరిగెల రాజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని 12వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జానకీరామ్, చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: ప్రచారం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రచార హోరు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో కాంగ్రెస్ ప్రచారం ఊపందుకుంది. ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని నాయకులు జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఆడబిడ్డల వివాహానికి లక్షతో పాటు తులం బంగారం, నిరుద్యోగులకు ఉద్యోగ క్యాలెండర్ పథకాలను వివరిస్తూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

షాద్‌నగర్‌రూరల్: గైరాన్ పొలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగారెడ్డిగూడ గ్రామ శివారులోని సర్వే నంబర్ 287లో గైరాన్ పొలం ఉందని తెలిపారు. ఈ పొలంలో కొందరు అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని వారు ఆరోపించారు. వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి దారి లేకుండా గైరాన్ పొలాన్ని కబ్జాచేసి ప్రహరీ నిర్మిస్తున్నారన్నారు. దీంతో వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అపూర్వ సమ్మేళనం

మొయినాబాద్‌రూరల్: ఏపీలోని మచిలీపట్నంలో శ్రీ వేంకటేశ్వర హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో 1989–93 బ్యాచ్ 120 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించారు. ఆ విద్యార్థులు శనివారం మండల పరిధిలోని వ్యవసాయ క్షేత్రంలో అపూర్వ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనానికి 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాలలో తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 30 సంవత్సరాల క్రితం ఉన్నత విద్యనభ్యసించిన వారంతా ప్రభుత్వ ఉద్యోగులుగా, పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా తాము స్థిరపడ్డట్లు పేర్కొన్నారు. కుటుంబ పోషణలో ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు తెలిపారు. అనంతరం ఒకరినొకరు కుటుంబ, పరిచయాలు చేసుకున్నారు. ఈ సమ్మేళనానికి కోఆర్డినేటర్లుగా ప్రసాద్ శివపురం, కృష్ణారావులు బాధ్యతలు చేపట్టారు. ఎస్ శ్రీనివాస్, మల్లికార్జున్, అరుణ్‌కుమార్, పి రమేశ్, గిరిశ్, ప్రభు, చారి, ప్రకాశ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి బాలుడికి తీవ్ర గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మూగజీవాలు, చిన్నారులు సైతం ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఎటు చూసినా కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు కనిపిస్తున్నాయి. విద్యుత్ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి బాలుడు తీవ్ర గాయాలపాలైన ఘటన టీఎన్జీఓస్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీఓస్ కాలనీలో నివసించే రోషన్‌కుమార్, ప్రియాంకదేవి దంపతులకు కృష్ణకుమార్ (4) సంతానం. రెండు నెలల క్రితం బిహార్ నుంచి బతుకుదెరువు కోసం కాటేదాన్ ప్రాంతానికి వలస వచ్చారు. రోషన్ ఫుడ్స్ కంపెనీలో లేబర్‌గా పనిచేస్తున్నాడు. బాలుడు పిల్లలతో ఆడుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కడానికి యత్నించాడు. పక్కనే ఉన్న వైర్లను తాకాడు. దీంతో బాలుడికి షాక్ తగిలి కిందపడ్డాడు. అక్కడే ఉన్న స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఘటన తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటుచేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వీడాలని కోరుతున్నారు.



ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్

కాంగ్రెస్‌తోనే అందరికీ న్యాయం

- కసిరెడ్డిని గెలిపించుకుందాం
- ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
- సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. మాడ్గుల మండలం దిల్వార్‌ఖాన్‌పల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా రాఘవేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వివరించారు. అధికారంలో వచ్చిన వెంటనే గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ ప్రజలకు న్యాయం జరగడం లేదని భావించి.. ఆరు గ్యారంటీలను ప్రకటించారని తెలిపారు. నారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాఘవేందర్‌రెడ్డి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దళపతిగౌడ్, యాదయ్య, గోవర్ధన్, కిరణ్, శివగౌడ్, మంగయ్య, సయ్యద్ మీర్ భూపేశ్‌కుమార్, వేణురెడ్డి, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ప్రచారంలో మందా జగన్నాథం

ఆమనగల్లు పట్టణంలో నారాయణరెడ్డికి మద్దతుగా నిర్వహించిన ప్రచారంలో మాజీ ఎంపీ మందా జగన్నాథం పాల్గొన్నారు. కల్వకుర్తిలో కసిరెడ్డిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, మానయ్య, కృష్ణనాయక్, ఖాదర్, అప్పం శ్రీను, అలీం, శ్రీకాంత్, నాజర్, ఫరీద్, రహీం, కరీం, బాబా, మహేశ్ పాల్గొన్నారు. కసిరెడ్డి సతీమణి ప్రచారం ఆమనగల్లు మండలం మేడిగడ్డతాండలో శనివారం కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి మాధవి విస్తృతంగా ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో గడప గడపకూ తిరుగుతూ కసిరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎంపీపీ అనిత, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రవీందర్ నాయక్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాములు, నాయకులు మల్లేశ్, రాంజ్యానాయక్, పత్యానాయక్, సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.